హృదయభారం

శ్రీవిరించి

సుశీల గడియారం వంక చూచింది.

ఏడుగంటలు దాటి పదిహేను నిమిషాలు అయింది. అయిదారు నిమిషాలు ఆలస్యం అయినా బృందావన్ ఎక్స్‌ప్రెస్ యీ సరికి మదరాసు సెంట్రల్ స్టేషన్ బయటకు రావటానికి దాదాపు అరగంట పడుతుంది. తరువాత ఆటోరిక్షా దొరికించుకుని యింటికి బయలుదేరటానికి మరో అరగంట పడుతుంది. ఎంత చకచక వ్యవహరించినా ఎనిమిదిగంటల లోపల చేరుకోవటానికి కుదరదు.

'నాన్నగారు యింకా రాలేదేం?' అని పిల్లలు అప్పుడే రెండుమూడు సార్లు అడిగారు.

'వస్తారు. మీరు భోజనం చేసి కూర్చోండి' అని సర్దిచెప్పింది. వాళ్ల భోజనంచేయటానికి ఉత్సాహం చూపించలేదు.

'నాన్నగారు రానీ అమ్మా! అందరం కలిసే చేద్దాం' అంది అమ్మాయి వినత. వాళ్లను తొందరచేయడం యిష్టంలేక అలానే కూర్చుండిపోయింది సుశీల.

కుర్రవాడు ఆటబొమ్మలతో ఆడుకుంటున్నాడు. అయినా వాడి ధ్యాసంతా వీధిగుమ్మం వయిపే వున్నదని సుశీలకు తెలుసును.

'మీకేం హోంవర్క్ లేదా? ఏదయినా పాఠం అర్థంకాకపోతే అడుగు, చెబుతాను' అంది సుశీల

'నా హోంవర్క్ అంతా బడినుంచి రాగానే చేసేసుకున్నానుగా! రేపు పొద్దున్న టెస్ట్ వుంది. తెల్లవారాక

ఒక్క అరగంటసేపు చదువుకుంటే చాలు. ఇప్పుడేం పుస్తకాలు వద్దమ్మా' అంది వినత ముద్దుముద్దుగా.

దానికి నిండా యేడేళ్లు లేవు. అయినా బోలెడన్ని పుస్తకాలు చదువుతుంది. దాని శ్రద్ధ, ఆసక్తి చూస్తే సుశీలకు ముచ్చట వేస్తుంది.

టెలివిజన్‌లో యేదో ప్రోగ్రాం యిప్పుడే ప్రారంభం అయింది. చిన్న పిల్లల డ్యాన్స్.

మూడేళ్ల రవి ఆటబొమ్మలు ఒక పేపుకు నెట్టివేసి టెలివిజన్ ముందుకు వచ్చి కూర్చున్నాడు.

వినత సరేసరి! డ్యాన్స్ చూస్తూ కుదురుగా కూర్చోలేకపోతోంది. తనకు కూడ అలా వయ్యారంగా డ్యాన్స్‌చేయాలని వుంది. తల్లివంక చూచింది.

ఇలాంటి ప్రోగ్రాం వచ్చినప్పుడు శ్రద్ధగా చూడాలి గాని, మనం కూడా పిచ్చిగంతులు వేయగూడదు- అంటుంది సుశీల పిల్లలతో. తల్లి కోపపడుతుందే మోననే భయంతో వినత కుర్చీకి అంటుకుపోయి కూర్చుంది గాని మన సంతా నెమలి పురివిప్పి ఆడుతున్నట్లు డ్యాన్స్ చేస్తూనే వుంది.

చిన్నపిల్లల డ్యాన్స్ అయిపోయింది వార్తలు మొదలయినాయి.

సుశీల టెలివిజన్ ఆఫ్ చేసింది. 'నాన్నగారు యింకా రాలేదేం?' అని అడిగాడు రవి. వాళ్ల కళ్లమీదకు నిద్ర కూరుకురావడం స్పష్టంగా కనిపిస్తోంది సుశీలకు.

'వస్తారు అంత దూరంనుంచి రావాలా మరి!' అంది వినత ఆరిందాలా.

'రైల్లోనేగా వచ్చేది. నడిచి వస్తారాయేం!' అన్నాడు రవి.

సుశీల నవ్వుకుంది.

పిల్లల సంభాషణ తమాషాగా అనిపిస్తుంది ఆమెకు. వాళ్లకూ మనసులో ఆరాటం, ఉత్సాహం ఎక్కువగా వుంటాయి.

'పోనీ మీ రిద్దరూ అన్నం తినేసెయ్యండి.' అంది సుశీల.

పిల్లలు 'రెస్పాండ్' అవలేదు.

"నాన్నగారు యింటికివచ్చాక యింకా ఆలస్యం అయిపోతుంది గదా! స్నానం అదీ చేసిగాని భోజనానికి కూర్చోరు. మీరు తినేసేయండి." అంది మళ్లీ.

"అమ్మా, నాకేం తెస్తారంటావు నాన్న బెంగుళూరునుంచి" అని అడిగాడు రవి.

"యేమో, చూద్దాంగా. నువ్వేం అడిగావు?"

"యేమీ అడగలా. అయినా నాన్న యేదోవొకటి తెస్తారుగా నాకు" అన్నాడు వాడు ఎంతో ధైర్యంగా.

"నేను మాత్రం జెమ్స్ పాకెట్ తెమ్మని చెప్పాను" అంది వినత.

"జెమ్స్ పాకెట్లు యిక్కడ కూడా దొరుకుతాయిగా. అంత దూరంనుంచి తీసుకురావడం ఎందుకు?"

"నాన్నగారికి బజారుకు పోవటానికి, యేమన్నా కొనడానికి టైం వుండదుగా ఎప్పుడూ. అందుకని బృందావనంలోనే అమ్మే జెమ్స్ పాకెట్ గాని పాలకోవాలు గాని తెస్తారు. అందుకని అవే తెమ్మని చెప్పాను" అంది వినత జవాబుగా.

పిచ్చి పిల్ల- అనుకుంది సుశీల- మనసులోనే.

ఎక్కడికక్కడ సరిపెట్టుకోవడం- తనలాగే- యిప్పటినుంచి అలవాటు అవుతున్నాయి దీనికి. అలా వుంటేనే జీవితంలో సుఖపడడం కుదురుతుంది.

ఆనందరావు దాదాపు ప్రతి నెల బెంగుళూరు వెడతాడు ఒక శని ఆది వారాలలో. అక్కడ ఉద్యోగం మాని వేసినా యింకా యేవో పనులు అతనికి అట్టే వుండిపోయినాయి. శనివారం ఉదయం బృందావన్‌లో వెళ్ళి ఆదివారం సాయంకాలానికి తిరిగివచ్చేస్తాడు. తన ప్రయాణాలకు బృందావన్ ఎక్స్‌ప్రెస్ ఎంతో అనుకూలంగా ఉన్నదని మురిసి పోతాడు- ఆనందరావు శనివారం సాయంకాలం, ఆదివారం ఉదయం తను హాజరు కావల్సిన మీటింగులు చూచుకుని సాయంకాలానికల్లా వచ్చి కుటుంబంతో చేరుకోవడం అతనికి ఎంతో హుషారుగా వుంటుంది.

నడివయసులో పడ్డ ఆనందరావుకు ప్రయణాలతో చిరాకూలేదు, ఉత్సాహమూ లేదు- నిజానికి ఏదయినా పని వుంటే తప్ప ఎక్కడికీ కదిలే స్వభావం కాదు అతనిది. కాని ప్రతిసారీ ప్రయాణం ముగించి వచ్చిన తర్వాత అక్కడి సంగతులన్నీ అతి హుషారుగా విపులంగా చెబుతాడు సుశీలకు. పిల్లలు వేసే ప్రశ్నలకు కూడా విసుక్కోకుండా సరసంగా జవాబులు చెబుతాడు. అతని కబుర్లు వింటూ వుంటే తాము కూడా ప్రయాణంచేసినట్లే వుంటుంది కుటుంబానికంతటికీ- బహుశ యీ కబుర్లు అప్పటికప్పుడే వినడానికే గాపున పిల్లలు నిద్రపోకుండా కని పెట్టుకు కూర్చుంటారు- అనుకుంది సుశీల.

-ఈ విషయాలన్నీ సమాలోచించు కుంటూ కూర్చుంటే అప్పుడే తొమ్మిది గంట లయిపోయింది.

రవి సోఫాలో నిద్రకు వొరిగాడు. వినత పత్రిక పుటలు తిప్పుకుంటూ కాలక్షేపం చేస్తోంది.

సుశీల రవిని లేపింది.

వినత పైకి తేలటం లేదుగాని దానికీ నిద్ర ముంచుకువస్తోందని సుశీలకు అర్థ మయిపోయింది. ఇక ఊరుకుంటే లాభం లేదు. మరీ ఆలస్యం అయిపోతే ఆరోగ్యానికి భంగకరం గనుక పిల్లలిద్దరికీ అన్నం పెట్టేయాలనుకుంది.

పిల్లలు యీ మారు యేమీ బెట్టు చేయలేదు.

వాళ్ళ భోజనాలు చేయించి పక్కలు దులిపివేసి పడుకోబెట్టి సుశీల వళ్ళీ

డ్రాయింగ్‌రూమ్‌లోకి వచ్చింది. ఆయన నాడు యింకా రాలేదేం చెప్మా— అంటూ మళ్ళీ ఆలోచనలలో మునిగిపోయింది.

ఒకవేళ బయలుదేరలేదా యేమిటి?

బయలుదేరక పోవటానికి కారణం యేమీ కనబడలేదు.

పని కొంతపోవడం అంటూ వుండదు. పన్నెండు గంటలు అయ్యేటప్పటికల్లా 'మీటింగ్' అయిపోతుంది తరువాత భోజనం చేసి ఒక గంట విశ్రాంతి తీసుకుంటూ ఎవరేనా స్నేహితులు కబుర్లు చెబుతూవుంటే వింటూ కూర్చుంటానంటారు.

స్టేషనుకు వెళ్ళడమూను, రైలు ఎక్కడమూను: టిక్కెట్టు కొనుక్కునే అవసరం లేదు: పోనూ, రానూ ఒకే నాడు [illegible] ముందుగా తీసుకుంటారు. ప్రయాణాలలో యెప్పుడూ చివరి నిముషందాకా యేర్పాట్లు చేసుకోకుండా [illegible]వడం ఆనందరావుకు యిష్టం కాదు.

ప్రతిదీ నియమప్రకారం తూచినట్లుగా యే స్టెప్‌కు ఆ స్టెప్ ముందుగా చేసేసి కూర్చుంటాడు అతను. జీవితంలో 'శ్రమ పట్ల' అతనికంత యిష్టం అనే కాదు, తనకు సంబంధించిన వాళ్ళందరూ యిలాగే వుండాలని, యెంత కష్టమయిన పనిఅయినా సజావుగా నిర్వహించడానికి యిదొక్కటే మార్గమని ఆనందరావు అప్పుడప్పుడు చిన్న సైజు ఉపన్యాసాలు కూడా యిస్తూవుంటాడు. రైలు రావటం ఆలస్యం అయితే తప్ప అతనెప్పుడూ దాన్ని 'మిస్' చేయడు. సుశీల నవ్వుకుంది యీ సంగతులన్నీ గుర్తుకు వచ్చి. నిద్రపోతున్న పిల్లల వంక అప్యాయంగా చూచి వచ్చింది. ఈ పిల్లలను పెంచడం, పెద్దచేయడం, వాళ్ళకు జీవితం సరిగా అర్థం అయ్యేట్లు విద్యాబుద్ధులు నేర్పడం.. యిదంతా సంసార బాధ్యత దీన్ని చక్కగా నిర్వహించటంలోనే వుంది ఘన చాకచక్యం.... ఎక్కడ యే పొరపాటు వచ్చినా జీవితాంతం దుఃఖించాల్సి వస్తుంది సుమా— అని అనేక సార్లు సుశీలను హెచ్చరిస్తూ వుంటారు.

కాని సుశీలకే ఒక్కొక్క మారు అర్థంకాకుండా పోతుంది యీ మనిషి సంగతి; పద్ధతి: ఈ పదేళ్ల కాపురంలోను తనకు ఆనందరావు ఎంత అర్థం అయినాడో అంతగానూ అర్థంకాకుండా పోయినాడని అనిపిస్తుంది ఆమెకు.

ఒడుదుడుకులు లేకుండా కాలం వెళ్ళదీయటం చాలును తనకు. అతనికి మాత్రం అంతే చాలదు. ఇంకేదో కావాలి: అలాగ, అతను కానిదానికని లేని దానికని పరుగులు తీస్తున్నాడని సుశీల అనుకోదు.

రోడ్డుమీద ఏ 'ఆటో' పోతున్నట్లు శబ్దం అయినా సుశీల వీధివయిపు దృష్టి

సాగిస్తోంది. వరండాలో దీపం వెలిగించే వుంటుంది.

మరీ రోడ్డుకు దగ్గరగా వున్న ఇల్లు అవడంవల్ల అన్ని వాహనాల చప్పుళ్లు వినిపిస్తాయి. ప్రతి ఆటో, ప్రతి కారు తమ ఇంటిముందే ఆగుతున్నట్లుగా అనిపిస్తుంది. తీరా అవి యిల్లు దాటి పోవడంతోటే— నిట్టూర్పు విడవాల్సి వస్తుంది. వాటిని గమనించకుండా వుండటానికి ప్రయత్నించనంత వరకు పోతుంది ధోరణి.

డోర్ బెల్ మోగేసరికి ఉలిక్కిపడి లేచింది సుశీల. యాదృచ్ఛికంగా గడియారం వంక చూస్తూ వీధి గుమ్మం వరకూ పరుగెత్తింది.

తొమ్మిదిన్నర.

తలుపు తీయటంతోటే ఆనందరావు చేతిలో బ్రీఫ్ కేస్‌తో నిలబడ్డాడు.

'వచ్చేశారా !' అంది ఆనందంతో పెల్లుబికిపోతూ.

'రాక ఏమవుతాను.' అంటూ షూస్ విప్పుకుంటూ కూర్చున్నారు.

'రైలు ఆలస్యం అయిందా బాగా !'

'అవ్వే. ఒక్క అరగంట ఆలస్యం అంతే— కాని యింకో గొడవలో చిక్కుకుపోయి యింత పేపు అయింది—'

'పిల్లలేరీ ! నిద్రపోయారా? పోనీలే లేపకు. ఈమారు వాళ్ళకోసం మంచి మంచి వస్తువులు తెచ్చాను. నింపాదిగా చూపిస్తాన్లే రేపు— నువ్వింకా భోజనం చేయకుండా కూర్చున్నావు గదూ ! ఎంత, అయిదు నిముషాలలో వచ్చేస్తాను— వడ్డించేయి—' అన్నాను బాత్‌రూంలోకి హడావిడిగా వెడుతూ.

2

ఆనందరావు బెంగుళూరు సిటీస్టేషన్‌కు వచ్చేటప్పటికి యింకా రైలు రాలేదు. లెక్కప్రకారం అయితే ఈ సరికి అది మదరాసు నుంచి వచ్చి తిరుగుప్రయాణానికి సంసిద్ధం అవుతూ వుండాలి. ప్లాట్‌ఫారం జనంతో కిటకిట లాడుతోంది. ప్రయాణికులంతా సామాన్లు పరముకుని హడావిడిగా వున్నారు.

అతను ఎంక్వయిరీ చేయగా బృందావనం అరగంట లేటు అని చెప్పారు. అరగంటకు యింకో అరగంట కలుపుకుంటే— మరో గంట గడిస్తేతప్ప తనకు బెంగుళూరు నుంచి మోక్షం లేదన్నమాట ! ఈ గంట పేపు యిలా కాళీగా ప్లాట్‌ఫారం మీద దేబిరిస్తూ నిలుచునే బదులు యింకెవరినయినా చూచి రావచ్చు. స్టేషనుకు మల్లేశ్వరం బాగా దగ్గిర. పది నిముషాల్లో వెళ్ళి రావచ్చును.

మల్లేశ్వరంలో తన స్నేహితుడు 'అర్జునరావు' వున్నాడు. వెళ్ళి చూచి వస్తే సంతోషిస్తాడు. అతన్ని చూచి కూడా ఆరు నెలలు దాటింది. అసలు బెంగుళూరు వచ్చినప్పుడల్లా తమ ఇంట్లోనే దిగమని కలుసుకోకుండా వెళ్ళవద్దని మరీ మరీ చెబుతూ వస్తున్నాడు. అయితే తనకు మీటింగ్‌లకు దగ్గరగా

వుండదని స్నేహితులతో కబుర్లుపెట్టుకు కూర్చుంటే తను చేయవలసిన పని గట్టెక్కుతుందని యిన్నాళ్ళూ అతనికి ముఖం చాటుచేస్తూ వచ్చాడు. పోనీ, యిప్పుడు గంట సమయం దొరికింది గనుక వెళ్ళి ముఖంచూపించి వస్తే బాగుంటుందనిపించింది.

ఆనందరావు వెళ్ళేసరికి అర్జునరావు యింట్లోనే వున్నాడు. అతనికంటే పిల్లలు మామయ్యొ వచ్చారని మరీ సంతోషించారు. వాళ్ళకోసం క్యాడ్‌బరీ చాక్‌లెట్లు కొనుక్కొ మరీ వెళ్ళాడు గదా!

'ఆనందం, నువ్వు చేసేపని యేమీ బాగుండలేదు' అన్నాడు అర్జునరావు.

'అర్జున్! ఆ మాట అలా వుంచు. నే నిక్కడ కూర్చున్న కాసేపూ నిష్ఠూరాలు వల్లించకుండా యేవయినా ఉపయోగించే సంగతులు మాట్లాడు.... నాకు మాత్రం స్నేహితులతో సరదాగా గడపాలని ఉండదా ఏమిటి? కుదరదు, యేంచేయమంటావు? ఇప్పుడయినా రైలువాళ్ళ పుణ్యమా అని యిటు రాగలిగాను' —అంటూ ఆనందరావు అతనితో సంభాషణలో మునిగిపోయాడు.

వాళ్ళు మాట్లాడుకుంటూ ఉండగా అర్జునరావుయింటి మేడమీది ఆసామి వచ్చాడు. ఆనందరావుకు అతనితో ముఖ పరిచయంతప్ప యింకేం లేదు.

'మీరు దేవునిలా వచ్చారనుకుంటాను. మాకో ఉపకారం చేసిపెట్టాలి.' అని ఆనందరావు చేతులు పుచ్చుకున్నాడాయన.

ఆనందరావుకు విషయం యేమిటో తెలియక ఉక్కిరిబిక్కిరి అయినాడు. 'నా వల్ల కావలసిన పని యేముంటుంది?' అని మనసులోనే అనుకుంటూ పైకి మాత్రం 'మీరు ఇంత ఇదిగా చెప్పాలా! అదేమిటో చెప్పండి-' అన్నాడు.

'మా ఇందిర అర్జెంటుగా మద్రాసు వెళ్ళాలి. తోడు లేకుండా యెప్పుడూ ప్రయాణం చేయలేదు. నాకేమో బయలుదేరాలంటే కుదరకుండా వస్తుంది. నాలుగు రోజులుగా ప్రయాణం వాయిదా పడిపోయి, ఆక్కడనుంచి కబురుమీద కబురు వస్తున్నాయి. మీరు శ్రమ అనుకోకుండా ఆమెను మద్రాసు తీసుకు వెళ్ళాలి, మీతోపాటు. మీ మేలు మరువలేం!, అన్నాడాయన.

ఆనందరావుకు ఏమీ అర్థం కాక అర్జునరావు ముఖంవంక చూచాడు. ఆ ముఖంలో అతని కేమీ సందేశం దొరకలేదు.

'నేను స్టేషన్‌దాకా వచ్చి ఎకామిడేషన్ సంగతి చూచుకుంటాను. ఆ విషయం మీరేం శ్రమపడనక్కరలేదు. మీరు 'ఊ' అంటే యిప్పుడే టాక్సీ తీసుకువస్తాను. మరో పది నిముషాలలో యెలాగూ మీరు బయలుదేరుతున్నారు గనుక యీ చొరవ తీసుకుంటున్నాను. మీకు మీ అర్జునరావు ఒకటి, నేను



మరొకటి అనుకోకండి—' అంటూ ఉక్కిరిబిక్కిరి చేయసాగాడు.

ఆనందరావుకు 'ఊ' అనక తప్పలేదు. అయినా ఇందులో తను పడే శ్రమ యేమీ లేదు గనక పోనీలే పాపం అనుకున్నాడు.

అన్నట్లుగానే పదినిమిషాలలో టాక్సీ వచ్చి యింటిముందు నిలిచింది. ఆనందరావు స్నేహితుడికి 'గుడ్‌బై' చెప్పి కూర్చున్నాడు. వెనక సీట్లో ఇందిర, మేడమీది ఆసామి కూర్చున్నాడు.

వాళ్ళు స్టేషన్‌కు వచ్చేసరికి బృందావనం ప్లాట్‌ఫారంమీద విడిసి వుంది.

ఆనందరావు తన కంపార్ట్‌మెంట్‌కు నింపాదిగా నడిచాడు.

ఆమెకూడా అతన్ని అనుసరించింది.

అయిదునిముషాల్లో ఆయన టిక్కెట్‌తో సహా వచ్చి వాళ్ళను కలుసుకున్నాడు. 'మీ సీట్ దగ్గరే యేర్పాటు చేస్తాను' అన్నాడు. ఆ సీట్ 'ఎలాట్' అయిన మనిషితో మాట్లాడి 'మార్పిడి' సంపాదించాడు.

ఈయన మొత్తంమీద కాలాంతకుడే! చివరి క్షణంలో బృందావన్ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ సంపాదించడమే గాకుండా అవలీలగా తనకు అనుకూలమయిన సీట్ కూడా సాధించాడు అనుకున్నాడు ఆనందరావు.

'నే నిప్పుడు ఇంటికి వెళ్ళగానే మా తమ్ముడికి టెలిఫోన్ చేస్తాను. ట్రంక్ కాదులెండి. యస్. టి. డి. లో మాట్లాడి

వాడిని స్టేషన్కు వచ్చి మిమ్మల్ని కలుసుకో మంటాను.' అన్నాడాయన ఆనందరావుతో.

'మదరాసు చేరుకునేటప్పటికి బాగా చీకటిపడిపోతుందా?, అనడిగిందామె.

'నువ్వేం బెంగ పెట్టుకోమాకు. ఏడున్నర, ఎనిమిది అవుతుంది అంతే. వాడు వస్తాడుగా స్టేషన్కి. ఆనందరావు గారు వుండనే వున్నారు. ఫ్లాస్క్లో వుందా 'టీ' పోసుకున్నావు గదా? అంత అయా సంగా వుంటే కూల్ డ్రింక్స్ ఏమన్నా పుచ్చుకో. అవీ రైల్లోనే సర్వ్ చేస్తారు. ఇదుగో... అరటి పళ్ళు అత్తం యీ బాస్కెట్ లోనే వుంది గదూ! - ఇదుగో నీ టికెట్ ... మరి నేను వెళ్ళవస్తాను. నీవు ఇంటికి చేరకోగానే తమ్ముడిని నాకు టెలిఫోన్ చేయమని చెప్పు. అప్పటికిగాని నాకు మనసుకు తెరిపి అవదు. అయినా నాకేం అంత గాబరా లేదనుకో. ఆనంద రావు గారు ఉన్నారుగా! ఇంక వస్తాను నేను. వస్తానండీ ఆనందరావుగారూ! మీ సహాయానికి సహస్ర థాంక్స్-- సమయానికి మీరు దేవుడె అనుకుంటు న్నాను. శ్రమకు మన్నించండి. వస్తాను' అంటూ ఆయన అప్పగింతలు చెబుతూ వుండగానే రైలు కూతవేసి బయలు దేరింది.

ఆనందరావు తన సీట్లో ఒదిగి కూర్చు న్నాడు, మర్యాదకోసం.

ఇందిరతోపాటు సామానుకూడా భారీ గానే వుంది. పెద్ద సూట్ కేస్, పళ్ళబుట్ట, పుస్తకాల పాకెట్లు రెండు, ఎయిర్ బ్యాగూను! ఇవన్నీకాక ఆమె అనుకు కూర్చుందుకు పెద్ద డన్ లప్ దిండు. ఈ దిండు మొత్తం సీటును సగం ఆక్రమిం చేసింది. ఎంత ఒదిగి కూర్చున్నా ఆనంద రావుకు యీ దిండు కొంత ఆశ్రయం కాక తప్పలేదు.

రైలు బయలుదేరిన తర్వాత ఆనంద రావు తన బ్రీఫ్ కేస్లోనుంచి పుస్తకం బయటకు తీసి కూర్చున్నాడు. జనం కోలాహలం సద్దుమణిగిన తర్వాత చదువు కుంటూ కూచుంటే సరిపోతుంది. పుస్తకాలు చదవడం అతని వృత్తి. ప్రతి ప్రయాణంలోను ఓ మాదిరిసైజు పుస్త కాలు నాలుగయినా చదివేస్తాడు. సమయానికి తనకు కావలసిన పద్ధతిలో మలుచుకోవడం ఆనందరావుకు తెలిసి నట్లుగా యింకెవరికి తెలియదనే చెప్పాలి.

వెండర్ కాఫీ తీసుకు వచ్చినప్పుడు రెండు కాఫీలు ఆర్డర్ వేశాడు. ఒకటి ఆమెకు ఆఫర్ చేయబోతే, నేను కాఫీ తీసుకోనండీ. టీ తాగుతాను. మీరు తీసు కోండి. ఫరవాలేదు, అంది.

టీ రావటానికి యింకా టైం పడుతుం దన్నాడు వెండర్. తనుకూడా కాఫీ తీసు కోవాలో, మానాలో క్షణంపాటు అర్థం కాలేదు ఆనందరావుకు. అతను తటపటా యిస్తుంటే 'ఫరవాలేదు. మీరు తీసుకోండి-

నాకు కాఫీ పడదు. అందుకని–' నవ్వుతూ చెప్పింది.

ఆనందరావు యేమాత్రం డెలికసీ ఫీలవ్వకుండా కాఫీ తీసుకోక తప్పలేదు ఆమె నవ్వు చూశాక.

కాస్సేపు అయినాక, ఆమె బాస్కెట్ లోనుంచి యేదో పాకెట్టు బయటకు తీసింది. ఒక స్వీట్, రెండు గారెలు, రెండు అరటిపళ్ళు ఓ పేపర్ ప్లేట్లో సర్ది ఆనందరావుకు అందించింది. అతను మొహమాటంలో పడ్డాడు. సాధారణంగా భోజనానికి, భోజనానికి మధ్య యేమీ పుచ్చుకోడు కాఫీ తప్ప. ఘనపదార్థాలు అసలే తనకు చుక్కెదురు– అందులోనూ ప్రయాణం చేస్తున్నప్పుడు.

'అబ్బే నాకు వద్దండీ. మీరు తీసుకోండి' అన్నాడు.

'అట్లా అంటే ఎట్లా? ఫరవాలేదు' అంది ఆమె.

'నేను అంత తీసుకోలేనండీ. నాకు పడవు అవన్నీ–––'

'మరీ విచిత్రంగా చెబుతారు. స్వీట్ పడనివాళ్ళుంటారా? మరేం బిడియం వద్దు. నాకు కాఫీ వంటికి పడదు గనక యిందాక వద్దన్నాను ––మీరు తీసుకోక పోతే నేనూ తినలేను. ఆ––యిందండీ–' అంది ఆమె బలవంతంగా అతని చేతుల్లో పెడుతూ.

ఆనందరావుకు 'సీన్' క్రియేట్ చేయడం యిష్టంలేదు. ప్లేట్ అందుకున్నాడు. అతను అమిత మొహమాటంగా స్వీట్ తినడం పూర్తి చేయడంతోటే ఆమె 'ఇంకో స్వీట్ యిస్తాను' అంది. ఆనందరావు తన ప్లేట్ దూరంగా జరుపుతున్నాడు– ఆమె ముక్క అందులో వేయడానికి ముందుగానే.

'అయ్యో' అంది ఆమె

'వద్దండీ. ఎక్కువైతే కష్టం'

'పోనీ యింకో అరటిపండు తినండి'

––తీసుకోక తప్పలేదు ఆనంద రావుకు.

'మీరు సమయానికి రాబట్టి సరిపోయింది గాని–––'

'అబ్బే–– నేను చేసిందేముందండీ–' అన్నాడు.

మీరేం చేస్తుంటారు ఉద్యోగంలో?' అనడిగింది.

ఆనందరావు చెప్పాడు.

'అలాగా. చాల సంతోషం', అంది ఆమె. అతను మళ్ళీ పుస్తక పఠనంలో మునిగిపోవడంతో ఆమె యింకేమీ డిస్టర్బ్ చేయకుండా వుండిపోయింది.

రెండు రోజులుగా నిర్విరామంగా పని చేసినందువల్ల, ప్రయాణ అలసటవల్ల అతనికి నిద్ర కళ్ళమీదకు ముంచుకువచ్చినట్లుంది. చదవడంమీద శ్రద్ధ ఆనడంలేదు. అతనికి గమనం లేకుండానే నిద్రలో పడిపోయాడు.

రైలు కుదుపుకు మెలకువ వచ్చి చూసుకుంటే తన తల ఆమె

భుజంమీద వాలిగివుంది. ముంజేయి ఆమె వొడిలో వాలివుంది.

సీట్‌లో సర్దుకు కూర్చుని ఆమె యేమనుకుంటుందోనని భయపడుతూ 'క్షమించండి. నిద్రలో నాకు తెలియలేదు-' అన్నాడు.

'ఫరవాలేదులెండి-' అందామె చిరునవ్వుతో; యిదేం పెద్ద విషయం కానట్లుగా ముఖం పెట్టి.

అయినా ఆనందరావుకు చాల సిగ్గనిపించింది. తను యేదేనా ప్రయత్నంచేసి నిద్రలో కూరుకుపోకుండా వుండాలనిపించింది. పైకి అలా అన్నారు గాని- ఆమె మనసులో యేమనుకున్నారో!

తనవల్ల జరిగిపోయిన పొరపాటుకు ఆనందరావు మనసులోనే కుమిలిపోయాడు. పైకి మాట్లాడవలసిన సంగతి కాదు.

ఉన్నట్లుండి ఆమె శ్వాస పీల్చడంతో ఆయాసపడుతున్నట్లు అనిపించింది ఆనందరావుకు. తనలాగే ఆమెకూడా మనసులో యేమయినా ఆరాటపడుతుందేమో అనుకున్నాడు. తను చేయగలిగింది యేమీ లేదు.

టీ కుర్రవాడు వస్తే ఇద్దరూ టీ తాగారు.

'వేడివేడి టీ తాగితే నాకు కాస్త రిలీఫ్‌గా వుంటుంది' ఆమె అన్నది.

ఇందాకటికంటె ఆయాసం కాస్త తగ్గినట్లు అనిపించింది ఆనందరావుకు. కాని యీ రిలీఫ్ పదిపదిహేను నిమిషాలకన్నా ఎక్కువసేపు పనిచేయలేదు.

ఉన్నట్లుండి ఆమె ఎక్కువగా వగరుస్తూ సీట్లో అతలాకుతలం అయిపోతున్నట్లు అనిపించింది.

ఆనందరావు యేమీ తోచకుండా అయిపోయి 'యేమండీ, యేమయింది' అన్నాడు ఆదుర్దాగా

'దయచేసి ఆ సూట్‌కేస్ తీసి దాన్లో మందుసీసా వుంది. అందుకోండి' అంది. సూట్‌కేస్ తాళంవేసి వుంది. తాళంచెవి యెక్కడ- అనుకుంటూ వుండగా ఆమె తన చేతిలోని పర్సువంక చూచింది.

'ఇవ్వండి' అన్నాడు. ఆమె చేయి కదపలేకపోయింది.

నోట్లోంచి మాటకూడా బయట పడడంలేదు

'తీసుకోండి' అంది అమిత ప్రయాసతో.

ఆనందరావు ఆమె తొడమీద వున్న చేతిపర్సు తీసుకుని అందులోని తాళాల గుత్తి బయటకు తీశాడు. ఆ గుత్తిలో నుంచి 'సూట్‌కేస్' తాళంచెవి యేదో గమనించడం కష్టంకాలేదు.

సూట్‌కేస్ పాకెట్లోవున్న మందుల పాకెట్లు ఆమె సూచనమీద బయటకు లాగాడు. 'ఆ రంగు కాప్సూల్ ఒకటీ, తెల్లమాత్ర ఒకటీ త్వరలో యివతలకు తీయండి-' అంది ఆమె యింకా రొప్పుతూనే.



ఆనందరావు అలాగే చేశాడు.

ఆమె చేయి ముందుకు చాపబోయింది. అవి అందుకుందుకు కాని నిస్సత్తువగా చేయి వొడిలోనే వాలిపోయింది.

ఆనందరావు అయోమయంలో పడిపోయాడు.

'కాస్త మంచినీళ్లు అందుకోండి త్వరగా....'

బాస్కెట్‌లోంచి నీళ్ల సీసా తీసి గ్లాసులో వంచాడు.

'ఆ రెండు మాత్రలూ నా గొంతులో వేయండి ..'

ఏ మాత్రం ఆలోచించకుండా ఆ పని చేశాడు ఆనందరావు. వెంటనే గుక్కెడు నీళ్లు కూడాపట్టించాడు, ఆమె చేయి ముందుకు కదిపి అతని ఎడమ చేతిని గట్టిగా పట్టుకుంది. ఆమె చేయి వణికిపోతూవుండడం స్పష్టంగా తెలుస్తోంది.

రెండుమూడు నిమిషాలలోనే ఆయాసం కాస్త తగ్గింది.

'అమ్మయ్య' అనుకుని నిట్టూర్పు వదిలింది ఆమె.

'మీకు శ్రమ యిస్తున్నాను' అంది మళ్లీ. అతనికి యేమీ అర్థం కాలేదు. సమాధానం చెప్పలేకపోయాడు.

'కాస్త గుండెమీద చేత్తో రాస్తారా ?'

ఆనందరావు బిడియంగా వుండిపోయాడు.

"నెప్పిగా వుంది. కాస్త బరువుగా

నాలుగయిదుసార్లు రాసుకుంటే తగ్గిపోతుంది. నాకు చేయి స్వాధీనంలో లేదు. మీరేం అనుకోకుండా గుండెలమీద రాయండి, ప్లీజ్–' అంది.

ఆనందరావు యిబ్బందిగా ఫీ వుతూ ఆమె ఎదురు రొమ్ముమీద వేళ్ళు ఆన్చాడు. 'ఇంకా కొన్త పక్కకి కిందికి.... ఆ! అలా ... అలాగే నాలుగయిదుసార్లు గుండెపయిపుకు రాయండి' అంది.

మంచి, చెడు ఆలోచించుకునే వ్యవధానం లేదు. ఆనందరావు ఆమె కోరిన ఉపచర్యలన్నీ చేశాడు. దాదాపు ఒక పావుగంట. యిరవయి నిముషాలు అయిం తరవాత ఆమె కొన్తలో కొన్త మామూలు మనిషి అయింది.

ఫ్రీగా ఊపిరి పీల్చి వదిలింది.

'అమ్మయ్య. ఇప్పుడు సర్దుకుందండీ –' అంటూ ఆమె యీమాలు తానే సూట్ కేస్ మూత ఎత్తి మందులపాకెట్ అందుకుని అందులోంచి ఓ ఎరుపురంగు మాత్ర తీసుకు తినగలిగింది.

టీ వెండర్ వస్తే మరోమారు టీ తీసుకున్నారు.

అరోక్షణం స్టేషన్ దాటింది బృందావన్ ఎక్స్ప్రెస్.

'ఇంకెంతసేపు పడుతుందంటారు? మదరాసు చేరుకోటానికి ....' అంది ఆమె.

ఆమె ఒళ్లలో కూడా యింటాక వచ్చిన మార్పులు, నీరసం తొలగిపోయినాయి.

ఇప్పుడు ఆమె నవ్వుతూ వుంటే యింతసేపూ యేమీ జరగనట్టే అనిపించింది ఆనందరావుకు

"అందుకనే ఒంటరి ప్రయాణం అంటే భయం. నేను వెళ్లగలనన్నా యింట్లోవాళ్ళు నన్ను వెళ్లనియ్యరు. మీరు సమయానికి దేవుడిలా....'

'పదేపదే అలా అని నన్ను చిన్నబుచ్చకండి. నేను చేసిం దేముంది?' అన్నాడు ఆనందరావు.

'మంచివాళ్లు యెప్పుడూ అంతే లెండి–' అందామె. ఇంకా స్పీపాగి మీకు నిద్రవస్తే నిరామయంగా పడుకోండి. నా కింకేం బెంగా లేదు' అంది

3

ప్రయాణం వివరాలు చెబుతున్నంత సేపూ సుశీల ముఖంలో వస్తున్న మార్పులన్నీ గమనిస్తూనే వున్నాడు.

'హాయిగా ఆమె వడిలో తలపెట్టుకుని తతిమ్మా దూరమంతా కులాసాగా ప్రయాణం చేసివుంటారు–' అంది ఆమె. కంఠస్వరంలో చిరుకోపం, అసూయ స్పష్టంగా అగుపిస్తున్నాయి.

ఆనందరావుకు ఇలా జరుగుతుందని తెలుసు.

"నీకేం, నీవలా తేలికగా అనేస్తావు గాని నేనెంత ఇబ్బందిపడ్డానో నీ కెలా తెలుస్తుంది?"

"కాస్తో కూస్తో యిచ్చింది పదితే మటుకేం లెండి. సుఖం దక్కిందిగా! హాయిగా పగటిపూట పూలపాన్పుమీద శయనించి ప్రయాణం_"

అనందరావు సహించలేకపోయాడు.

"చాల్లే, సుశీలా. అసహ్యంగా మాట్లాడకు_"

"నేను యేం మాట్లాడితే మటుకేం లెండి. అంతా అయిపోయిందిగా!_"

ఆనందరావు ఇంకేం మాట్లాడలేక పోయాడు.

భోజనాలు అయిపోయి యిద్దరూ పడకగదిలోనికి వచ్చారు.

"తరువాత యేమయిందో చెప్పరేం? మదరాసు చేరాక వాడా యింటికి రావడం యింత ఆలస్యం ఎందుకయిందో వివ చరేం?" అంది కొంత ఎగతాళి మిళాయించి సుశీల.

'అదే చెప్పబోతున్నాను. మధ్యలో నీ అనుమానాలు, అసూయలూ_'

'అనుమానమేముందిలెండి. స్పష్టంగా కనిపిస్తూ వుంటే_"

'ఆడవాళ్ళు-అసూయలు అని వ్యాసం వ్రాయాలని వుంది'

'ఎన్నయినా రాస్తారు మీకేం?'

'నీ కెలా చెప్పాలి సుశీలా?' టూకీగా యేంజరిగిందో చెబుతా విను_ మద్రాసు సెంట్రల్‌లో దిగాం. అమెను 'రిసీవ్' చేసుకుందుకు యెవరూ లేరు. పావుగంట వెయిట్‌చేసి యెవరూ రాని నిర్ధారణ

చేసుకున్నా. అమెను యేం చేయాలి? 'టాక్సీ మాట్లాడిపెట్టండి. అడ్రస్ వుంది వెళ్ళిపోతాను'_ అన్నది అమె. కాని రాత్రి ఎనిమిదిన్నరకు అమెను అలా తేలికగా యేమీ బాధ్యతలేనట్లుగా యెలా వదిలేస్తాను?'

'అవును మరి! యెలా వదిలేస్తారు?'

'సర్లే, నీ హేళన! అమె దగ్గర టెలిఫోన్ నెంబర్ తీసుకుని స్టేషన్ నుంచి వాళ్ళయింటికి ఫోన్‌చేశాను. ఆ ఫోన్ చెడిపోయిందనీ పిలుపు అందదనీ తెలుసుకొందుకు పావుగంట పట్టింది. అప్పుడిక ఇంకేం మార్గంలేక టాక్సీలో

ఆ మె ను వే సు కు ని వాళ్ళ యింటికి వెళ్ళాను—'

'నయం ఇప్పటికయినా వచ్చారు. రాత్రంతా అక్కడ గడపి, తెల్లవారి యింటికి వద్దామనుకున్నారు గాదు!'

'కాసాకు విను. ఎక్కడో అయిన వరంలో వాళ్ళయిల్లు. టాక్సీలు ఒకంతట రావు. ఎలాగో అక్కడకు చేరుకున్నాం తీరా అక్క దేమయిం దనుకున్నావ్?'

'యేదో అయేవుంటుంది లెండి_'

"వాళ్ళు వూళ్ళోలేనేలేరు. ఇల్లు తాళం వేసివుంది. ఈ రోజు ఉదయమే తిరుపతి వెళ్ళారుట! తెల్లవారాక కాని రామని చెప్పారుట, పక్కయింటివాళ్ళతో!"

సుశీల ఉత్సుకతతో మెడ సారించింది.

'ఆమెను యేంచేయాలా అని తట పటాయిస్తూవుండగా పక్కయింటి ఆమె బయటకు వచ్చి— "అయ్యో ఇందిరమ్మ గారా! వచ్చారా! రండి, రండి లోపలకు—' అని ఆమెను ఆహ్వానించింది. వాళ్ళకూ వాళ్ళకూ బాగా పరిచయం. ఆమె ఆ రాత్రంతా వాళ్ళయింట్లోనే గడిపి తెల్లవారాక తమ మనవుడు, మనమరాలు తిరుపతినుంచి తిరిగివచ్చాక సురక్షితంగా అక్కడకుమారతానంది. పక్కింటి పిన్ని గారు 'ఇందిరమ్మగార్ని మేం వాళ్ళకు వప్పజెప్పుతాంలెండి. మీరేం బెంగ పెట్టుకోకుండా మీ యింటికి వెళ్ళండి" అంది. ఆమెకూడా అలాగే అన్నాక నేను అయినవరం నుంచి మన యింటికి ఆటో వేసుకువచ్చాను. ఇప్పటికయినా రాగలిగా నంటే యెంతో తొందరగా వచ్చినట్లు లెక్క—' ఈ దెబ్బయియేళ్ళ ముసలి దాన్ని యేమీ శ్రమ అనుకోకుండా మద్రాసుచేర్చారు. మీకుచాలా పుణ్యంవుం టుంది నాయనా' అంది ఆమె తెలుసా! కావాలి అంటే ఆ పుణ్యం అంతా నీకు ట్రాన్స్‌ఫర్ చేస్తాను' అన్నాడు ఆనందరావు' సుశీల మొహంలోకి గుచ్చిచూస్తూ.

సుశీల ముఖకవళికలన్నీ మారిపోయాయి. ఇందాకటినుంచివున్న అసూయామేఘాలు తొలగిపోయి మామూలు ప్రశాంతత ఆవరించింది.

"పాపం. ఆ ముసలామెను యింత రాత్రిపూట అక్కడ వదిలేయకపోతే— పోనీ మన యింటికి తీసుకురాకపోయి నారా, సరాసరి స్టేషన్ నుంచే! రాత్రంతా యిక్కడవుండి రెస్ట్ తీసుకుని రేపు మధ్యాహ్నం వాళ్ళ మనవడి ఇంటికి వెళ్లేవారు గదా!" అంది సుశీల.